—యస్.జయశ్రీ

# లవ్ టా(ప్)క్

## దసరా పండగ

పనిమనిషి 'నీల' అంట్లు బరబరా తోముతోంది.

ఎవరన్నా చూస్తారేమోనన్నట్లుగా దిక్కుదిక్కుమంటూ వచ్చాడు సుందర్రామయ్య. చేతులు రెండు వెనకాల పెట్టుకుని 'నీల' ముందు కూర్చున్నాడు.

ఏదో కూనిరాగం తీస్తున్న 'నీల' ఉలిక్కిపడి

"మీరా బాబూ... ఏందండీ... ఎండలో కూర్చున్నారు" అని అడిగింది.

మొహంమీద పడుతున్న వెంట్రుకలు మసి చేత్తోనే వెనక్కి తీసుకుంది.

"ఏమే నీలా... నువ్వు నల్లగా వున్నావనే నీ యమ్మ నీల అని పెట్టినట్టుంది. నా కళ్ళకి మాత్రం నువ్వు నిగనిగలాడుతూ అందంగా వుంటావే!"

ఒక్క క్షణం పరకాయించి చూసింది నీల.

"పొద్దు పడమర వాలే వయసులో అంతా అందంగా కనపడతాది" అంది చిలిపిగా నవ్వుతూ.

"నీమీద ఒట్టే. నువ్వు నిజంగా అందంగా వుంటావు. పండగకి పిల్లలందరూ వచ్చారు. నీకు పని ఎక్కువయింది కదూ?" సానుభూతిగా అడిగాడు.

"పండుగలు పబ్బాలు మీకుగానీ పనిచేసుకునే వాళ్ళం మాకేటుంటాదండీ!" అంది నీల.

"అలాగనకే నీల... నీకోసం ఈ చీర తెచ్చాను. రేపు పండగరోజు కట్టుకో"

అప్పటివరకూ వెనకాల దాచిన పేకెట్టు ముందుకు తీసాడు.

నీల గబగబా చేతులు కడుక్కొని ఆత్రంగా తీసి చూసింది.

నెమలి కంఠం రంగులో చిన్నచిన్న పూలున్న నేతచీర.

సంబరంగా అటు ఇటూ తిప్పింది.

"మరే నీల... నిన్ను ఎప్పట్నుంచో ఒక మాట అడగాలనుందే..." అంటూ మరేమో చెప్పబోయిన సుందర్రామయ్య అటు ఎవరో వస్తున్న చప్పుడవటంతో—

"తర్వాత మాట్లాడతాలే..." అంటూ వెళ్ళాడు.

చీరని అయన్ని మార్చి మార్చి చూస్తూ

"ముసలాయనా దసరా పండగ" అనుకొని నవ్వుకుంది తెలివిగల నీల.

పండగ మర్నాడు బండెడు అంట్లు ముందేసుకొని బరబరా రుద్దుతోంది నీల.

మెల్లగా సుందర్రామయ్య వచ్చాడు అక్కడికి.



"ఏమే నీల... నిన్న ఆ చీరలో నువ్వు మెరిసిపోయావే... మరే..."

"ఇదిగో పెద్దాయనా... నీకు నాతో యవ్వారాలేంటి... ఎక్కువ తక్కువ మాట్లాడితే నాకంటే పెద్దోళ్ళయిన నీ కొడుకు కూతుళ్ళను పిలిచి పంచాయతీ ఎడ్తాను... జాగరత్త... మరలా దీపాల మాసవరకూ నా డిః సెత్తను" అంటున్న నీలని చూస్తూ

ఒక్క గుటక మింగి చేసేదేమీలేక వెనక్కి తిరిగాడు సుందర్రామయ్య.

*